

వ్యాపార సముదాయాలకు సమయం సడలింపు

ఖిల్లా, మార్చి 3: రాబోయే రోజుల్లో మహాశివరాత్రి, గుడ్‌ఫ్రైడే, రంజాన్, ఉగాది, శ్రీరామనవమి, హనుమాన్ జయంతి లాంటి శుభకార్యాలు, పండుగల నేపథ్యంలో వ్యాపార సముదాయాలకు రాత్రివేళ సమయాన్ని సడలించామని పోలీసు కమిషనర్ తెలిపారు. కమిషనరేట్ పరిధిలో రాత్రి 10.30గంటల నుంచి 12గంటల వరకు మినహాయింపు ఇవ్వడం జరిగిందన్నారు. ఏప్రిల్ చివరి వరకు సడలింపు కొనసాగనుందన్నారు. ప్రశాంత వాతావరణంలో పండుగలను జరుపుకోవాలని, పెంచిన సమయాన్ని దుర్వినియోగం చేసుకోరాదని సీపీ అన్నారు.

అద్దె భవనాల్లో అంగన్‌వాడీలు



నగరంలోని గౌతంనగర్‌లో అద్దె భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

- జిల్లాలో అంగన్‌వాడీలకు సొంత భవనాలు లేక ఇబ్బందులు
- అద్దె భవనాల్లో కొనసాగుతున్న 606 కేంద్రాలు
- శిథిలావస్థలో 131 అంగన్‌వాడీ భవనాలు
- నాలుగు నెలలుగా కేంద్రాలకు అందని అద్దె
- జిల్లాలో 1500 అంగన్‌వాడీ కేంద్రాలు



డొంకేశ్వర్ మండలం నడ్కుడ గ్రామంలో అద్దె భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

నిజామాబాద్‌అర్బన్, మార్చి 3: అంగన్‌వాడీ కేంద్రాలపై ప్రభుత్వాలు చిన్న చూపు చూస్తున్నాయి. దీంతో అవి నిర్లక్షానికి గురవుతున్నాయి. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల అంగన్‌వాడీ కేంద్రాలు రోజురోజూ నిర్వీర్యం అవుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేక ఇరుకు గదుల్లో, శిథిలావస్థలో ఉన్న భవనాల్లో కేంద్రాలను నిర్వహించాల్సిన పరిస్థితి జిల్లాలో ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో పోల్చితే పట్టణ ప్రాంతాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలు ఎక్కువ శాతం అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. అద్దె భవనాల్లో సరైన వసతులు లేక చిన్నారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. జిల్లాలో 1500 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 447 కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయి. 447 కేంద్రాలు రెంట్‌ఫ్రీ భవనాల్లో కొనసాగుతుండగా 606 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. గతేడాది నవంబరు వరకు అంగన్‌వాడీల అద్దె చెల్లించిన ప్రభుత్వం గత నాలుగు నెలలుగా అద్దె చెల్లించకపోవడంతో ఇంటి యజమానులు అంగన్ వాడీ టీచర్లను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. జిల్లాలో కొన్ని చోట్ల ఇంటి యాజమానులు అద్దె కోసం అంగన్‌వాడీ కేంద్రాలకు తాళాలు వేసిన సంఘటనలు ఉన్నాయి. జిల్లాలో 131అంగన్‌వాడీ కేంద్రాలు శిథిలావస్థలో ఉన్నట్లు ఐసీడీఎస్ అధికారులు చెబుతున్నారు. చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు విద్యాబుద్ధులు నేర్పించే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాలు సర్కారు నిర్లక్ష్యంతో నిర్వీర్యం అయ్యే పరిస్థితులు ఉన్నాయి.


సమస్యల నిలయంగా అంగన్‌వాడీలు..

జిల్లాలో 1500అంగన్‌వాడీలు ఉండగా దాదాపుగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు ఏదో ఒక సమస్యతో ఇబ్బందులు పడుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అంగన్‌వాడీలు పాఠశాలల్లో, కమ్యూనిటీ భవనాల్లో కొనసాగుతున్నాయి. అక్కడ సరైన వసతులు లేక చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో 150 అంగన్‌వాడీ కేంద్రాల్లో టాయిలేట్ సౌకర్యాలు లేకపోవడంతో ఆరుబయ టే మూత్ర విసర్జన, మల విసర్జన చేయాల్సిన పరిస్థితి. 282 అంగన్‌వాడీలకు విద్యుత్ సౌకర్యాలు జిల్లాలో లేదు. దీంతో చిన్నారులు ఉక్కపోతతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. 131అంగన్‌వాడీలు లీకేజీలతో ఇబ్బందులు పడుతుండగా 212 అంగన్‌వాడీల్లో చిన్న చిన్న మరమత్తులు చేయాల్సి ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. 50 అంగన్‌వాడీ కేంద్రాలు తాగునీటి వసతి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

అద్దె భవనాల్లో ఇబ్బందులు..

నిజామాబాద్‌అర్బన్ ప్రాజెక్టు, ఆర్మూర్ ప్రాజెక్టుల పరిధిలో చాలావరకు అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఆర్మూర్ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 326 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 41 అంగన్‌వాడీలు సొంత భవనాల్లో, 171 అద్దెభవనాల్లో, 114 రెంట్‌ఫ్రీ భవనాల్లో కొనసాగుతున్నాయి. అర్బన్ ప్రాజెక్టు పరిధిలో 258 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 42 సొంత భవనాల్లో, 183 అద్దెభవనాల్లో, 33 రెంట్‌ఫ్రీ భవనాల్లో కొనసాగుతున్నాయి. సరైన సమయానికి అద్దెరాక పోవడంతో పురాతన భవనాలు, రేకుల భవనాల్లో నిర్వహిస్తున్నారు. కరెంట్, తాగునీటి సదుపాయాలు లేక అద్దెభవనాల్లో చిన్నారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. టీచర్లు వంట కోసం పెట్టె కూరగాయల, వంటగ్యాస్ బిల్లులు సరిపడా ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

కాంగ్రెస్‌లో నామినేటెడ్‌పై పెరుగుతున్న ఆశలు



- ఇప్పటికే జిల్లాకు చెందిన సీనియర్ నేతలకు దక్కిన పదవులు
- ముమ్మర ప్రయత్నాలు చేస్తున్న మరికొందరు
- కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్‌ఎస్ నేతలు
- జిల్లాలో మారుతున్న రాజకీయ సమీకరణాలు

నిజామాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సుదీర్ఘ కాలం కాంగ్రెస్‌లో పనిచేసి ఏ పార్టీకి వెళ్లకుండా ఉన్న నేతలు ప్రస్తుతం అధికారంలోకి రావడంతో పదవులపై ఆశలు పెట్టుకున్నారు. జిల్లాకు చెందిన సీనియర్ నేతలకు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులు వస్తాయని భావిస్తున్నారు. ఇప్పటికే నిజామాబాద్ నుంచి పోటీచేసి ఓడిపోయిన మాజీ మంత్రి షబ్బీర్ అలీకి రాష్ట్ర సలహాదారునిగా అవకాశం కల్పించారు. ఆయనకు క్యాబినెట్ హోదా ఇచ్చారు. జిల్లాలో సుదీర్ఘకాలం పార్టీలో కొనసాగి వివిధ పదవుల్లో పని చేసిన పీసీసీ ఉపాధ్యక్షులు తాహెర్ బిన్ హుందాన్‌కు రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్‌గా నియమించారు. వీరిద్దరికి పదవులు రావడంతో మిగతా నేతలు కూడా ఆశలు పెట్టుకున్నారు. జిల్లాకు చెందిన మాజీ విప్ ఈరవత్రి అనిల్, జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర కిసాన్‌సెల్ అధ్యక్షులు అన్వేష్ రెడ్డి, రాష్ట్ర పీసీసీ ప్రధాన కార్యదర్శులు గడుగు గంగాధర్, నగేష్ రెడ్డి, నగర అధ్యక్షులు కేశ వేణులు పదవులు వస్తాయని భావిస్తున్నారు. వీరితో పాటు అంతిరెడ్డి రాజిరెడ్డి, ముప్ప గంగారెడ్డి, నరాల రత్నాకర్‌తో పాటు ఇతర నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. వీరిలో ఇద్దరు లేదా ముగ్గురికి రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవుల్లో అవకాశం ఇవ్వనున్నట్లు తెలిసింది. మిగతా వారికి జిల్లా స్థాయిలో ప్రధాన నామినేటెడ్ పదవుల్లో నియమించనున్నట్లు పార్టీ వర్గాల సమాచారం బట్టి తెలుస్తోంది.

జిల్లాలో మారుతున్న సమీకరణాలు

జిల్లాలో కాంగ్రెస్ రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. అన్ని సంస్థలపై పట్టు సాధించేందుకు సిద్ధమవుతున్నారు. స్థానిక సంస్థల నుంచి పార్లమెంట్ వరకు అన్నింటిని చేజిక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. శాసనసభ ఎన్నికల్లో ఆరు నియోజకవర్గాల్లో రెండింటిని కాంగ్రెస్ గెలుచుకోవడంతో స్థానిక సంస్థలలో పట్టు సాధించేందుకు సిద్ధమవుతున్నారు. ఏఐసీసీ నేతలతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా ఈ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. ఇప్పటికే బీఆర్‌ఎస్ ఇతర పార్టీల నేతలను కొంత మందిని చేర్చుకోగా మరి కొంత మందిని చేర్చుకునేందుకు సిద్ధమవుతున్నారు. పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, నియోకవర్గ ఇన్‌చార్జిలు, జిల్లా అధ్యక్షులు, ఇతర సీనియర్ నేతలు గట్టి ప్రయత్నాలను చేస్తున్నారు. ప్రతిరోజూ బీఆర్‌ఎస్‌కు చెందిన నేతలతో చర్చలు జరపడంతో పాటు వారిని తమ పార్టీలో చేర్చుకుంటున్నారు. బీఆర్‌ఎస్ నుంచి వచ్చే ప్రజాప్రతినిధులకు తగిన అవకాశాలు ఇస్తామని హామీలిస్తున్నారు. జిల్లాలోని నగర కార్పొరేషన్‌తో పాటు బోధన్, ఆర్మూర్ మున్సిపాలిటీలకు చెందిన మెజార్టీ కార్పొరేటర్లు, కౌన్సిలర్లు పార్టీలో చేరే విధంగా సఫలీకృతులయ్యారు. పెద్ద నేతలను కూడా చేర్చుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఆర్మూర్ మున్సిపల్ చైర్మన్‌పై బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం నెగ్గగా ఆ తర్వాత 16మంది అదే పార్టీ కౌన్సిలర్లు ఈ మధ్యనే కాంగ్రెస్‌లో చేరారు. చైర్మన్ ఎన్నికకు షెడ్యూల్ ఇస్తే కాంగ్రెస్‌కు సంబంధించిన చైర్మన్‌ను ఇక్కడ ఎన్నికయ్యే అవకాశం ఉంది. బీఆర్‌ఎస్‌కు చెందిన వారు చైర్మన్‌ను దించినా తర్వాత కాపాడుకోకపోవడం వల్ల కాంగ్రెస్ నేతలు జరిపిన చర్చలు ఫలప్రదం కావడంతో సుదర్శన్‌రెడ్డి సమక్షంలో వారు చేరారు. ఇదేరీతిలో నిజామాబాద్ మేయర్‌కు సంబంధించిన వారిపై కూడా చర్చలు జరిపినట్లు తెలుస్తోంది.

• ఇండియన్ బుక్ ఆఫ్ సర్టిఫికెట్‌ను అందుకుంటున్న దృశ్యం



మహిళల ఆత్మరక్షణకు తైక్వాండో శిక్షణ

• బుక్ ఆఫ్ రికార్డ్ నెలకొల్పడం జిల్లాకు గర్వకారణం • న్యాయ సేవా సంస్థ రాష్ట్ర కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి

నిజామాబాద్ లీగల్, మార్చి 3: 'బేటీ బచావో, బేటీ పడావో' స్ఫూర్తితో న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బాలికల, మహిళల ఆత్మరక్షణ, హక్కుల కోసం తైక్వాండో కరాటే శిక్షణ ఇస్తుందని న్యాయ సేవా సంస్థ రాష్ట్ర కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ కళాశాల మైదానంలో ఆదివారం న్యాయ సేవాధికార సంస్థ, పోలీసు కార్యనిర్వాహక శాఖల సహకారంతో బాలికల, మహిళల ఆత్మరక్షణ కోసం నిర్వహించిన శిక్షణ ప్రదర్శన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తైక్వాండో కరాటే నేర్చుకున్న బాలికలు, జిల్లాలోని మిగతా బాలికలకు ఆదర్శంగా నిలుస్తారని అన్నారు. తైక్వాండో నేర్చుకున్న 11వేల మంది బాలికలు.. వేల మంది బాలికలకు కరాటే నేర్పడం ఎంతో గొప్ప విషయమన్నారు. ఆత్మరక్షణకు తైక్వాండో ముఖ్యమైన సాధనంగా చెప్పుకోవచ్చన్నారు. అసాంఘిక వ్యక్తులను, అసాధారణ చర్యలను ఎదుర్కొనడానికి ఈ కసరత్తు ఎంతగానో ఉపయోగపడుతుందని, మార్చి 8న నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి నేటి కార్యక్రమం దిక్సూచిగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. దేశ చరిత్రలో ఇంత పెద్ద శిక్షణ కార్యక్రమం బుక్ ఆఫ్ రికార్డ్ నెలకొల్పడం న్యాయసేవ సంస్థకు, జిల్లాకు గర్వకారణంగా ఉందని పేర్కొన్నారు. అనంతరం న్యాయసేవ అధికార సంస్థ చైర్‌పర్సన్, ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల మాట్లాడుతూ.. బాలికల ఆత్మరక్షణ కోసం తైక్వాండో శిక్షణ పెద్దపీట వేస్తుందని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు అందించిన సహకారాలు మరువలేనివని అన్నారు. అనంతరం పోలీసు కమిషనర్ కల్మేశ్వర్ శింగేనేవార్ మాట్లాడుతూ.. తైక్వాండో శిక్షణ బాలికల, మహిళలకు రక్షణ కవచంగా ఉంటుందన్నారు. కాగా, బుక్ ఆఫ్ రికార్డ్ హైదరాబాద్ కార్యాలయ ప్రతినిధి వసుధ అశోక్ ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా వీక్షించి ఇండియా బుక్ ఆఫ్ పత్రాన్ని న్యాయ సేవాధికార సంస్థ రాష్ట్ర కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, సంస్థ చైర్‌పర్సన్ సునీత కుంచాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్, తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యుడు మంథని రాజేందర్‌రెడ్డి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్‌బాబు, అజయ్‌కుమార్, పద్మావతి, జూనియర్ సివిల్ జడ్జి గోపికృష్ణ, కుష్బుచటోపాధ్యాయ, దీప్తి, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రతిమరాజ్, డీఈవో దుర్గాప్రసాద్, ఏసీపీ రాజవెంకటరెడ్డి, తైక్వాండో శిక్షకుడు మనోజ్, సంస్థ సూపరింటెండెంట్ పురుషోత్తమ్‌గౌడ్, వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



• డొంకేశ్వర్‌లో సాగు చేస్తున్న సజ్జ పంట



సజ్జ పంటపై రైతుల ఆసక్తి

- అధిక ధరలతో సాగుకు ముందుకు వస్తున్న రైతులు

డొంకేశ్వర్, మార్చి 3: రైతులు పసుపు పంట పూర్తయిన తర్వాత నువ్వు, టమాట, కొత్తిమీద సజ్జ పంటలను ఎక్కువ మొత్తంలో సాగు చేస్తుంటారు. కానీ ఈ సంవత్సరం రైతులు నువ్వు పంటను తగ్గించి సజ్జ పంటపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. సజ్జ పంట వేసిన రైతులు ప్రైవేటు వ్యాపారి దగ్గర ముందుగానే ఒప్పందం చేసుకొని సాగుచేస్తున్నారు. సజ్జకు రూ.7600 వరకు ధర ఉండడంతో ఆసక్తి చూపుతున్నారు. గత సంవత్సరంతో సగానికి పైగా ధర పెరగడంతోపాటు దిగుబడి తగినంత వస్తుండడంతో రైతులు ఆ పంటను పండించేందుకు ముందుకు వస్తున్నారు. పసుపు సాగు పూర్తిచేసుకున్న రైతులు వెంటనే నువ్వు పంట వేసేం దుకు సిద్ధమవుతుంటారు. కానీ ఈ సంవత్సరం మాత్రము నువ్వుసాగు తగ్గి సజ్జ సాగు పెరిగింది. గత ఏడాదితో పోల్చి కుంటే ఈ సంవత్సరం అధిక మొత్తంలో మండలంలో డొంకేశ్వర్, నూత్‌పల్లి, గాదేపల్లి, మారంపల్లి గ్రామాల్లో సజ్జ పంటను రైతులు సాగు చేస్తున్నారు. సజ్జకు అధికంగా ధర ఉండడంతో రైతులు ముందుకు వచ్చారు. రైతులు ప్రైవేటు వ్యాపారుల దగ్గర ముందుగానే క్వింటా సజ్జకు రూ.7600 వరకు ఒప్పందం చేసుకొని సాగు చేశారు. ఎకరం సాగు చేస్తే ఎనిమిది నుంచి 12క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని రైతులు అంచనా వేస్తున్నారు.


దిగుబడికి తగ్గట్టు లాభం : చిన్నారెడ్డి, రైతు, (నూత్‌పల్లి)



సజ్జలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. దీంతో మండలంలో ఇటీవల సజ్జలు ఎక్కువగా పండిస్తున్నారు. ఈ సీజన్‌లో నేను రెండు ఎకరాల సజ్జ వేశాను. ఎకరానికి పది క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. మార్కెట్‌లో క్వింటా రూ.7600వరకు ధర పలుకుతోంది. ఖర్చులు తక్కువ లాభాలు ఎక్కువగా ఉంటున్నాయి. అయితే సజ్జ పంటకు తెగులు సోకి మొలకలు సరిగా రావడం లేదు. మందుల పిచికారీతో రైతులకు భారం పడుతోంది.















పెన్షనర్లు తమ హక్కులను సాధించుకోవాలి




సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు

ఆర్మూర్‌టౌన్ , మార్చి3: విద్యుత్ పెన్షనర్లు ఏకతాటిపైకి వచ్చి తమ హక్కులను సాధించుకోవాలని తెలంగాణ విద్యుత్ పెన్షనర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు, గౌరవ అధ్యక్షుడు రమేష్‌లు అన్నారు. ఆదివారం పట్టణంలోని మహాలక్ష్మీకాలనీ కమ్యూనిటీ భవనంలో విద్యుత్ పెన్షనర్ జనరల్ బాడీ సమావేశానికి వారు హాజరై మాట్లాడుతూ గత ప్రభుత్వంలో విద్యుత్ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని, తమకు పూర్తిగా అన్యాయం జరిగిందని, అందరం ఏకతాటిపైకి వచ్చి సమస్యను పరిష్కరించుకుందామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యుత్ పెన్షనర్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ స్వామి, రాష్ట్ర ప్రధానకార్యదర్శి నర్సింలు, మహాదేవ్, శంకర్, ఎల్లికుమారస్వామి, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు బాపూజీ వచనాలయ నూతన భవన నిర్మాణానికి భూమిపూజ

నిజామాబాద్ అర్బన్, మార్చి 3:నగరంలోని రాష్ట్రపతి రోడ్‌లో గల బాపూజీ వచనాలయ లైబ్రెరీ నూతన భవనానికి ఈనెల 4న భూమిపూజ చేయనున్నట్లు బాపూజీ వచనాలయ అధ్యక్షుడు భక్తవత్సలం (డిల్లీ), కార్య నిర్వహణ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. రెండు కోట్లతో నిర్మించనున్న నూతన లైబ్రెరీ నిర్మాణ భూమిపూజకు అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ, ఎంపీ అరవింద్, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారుడు మహ్మద్‌అలీ షబ్బీర్, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, నగర మేయర్ నీతూకిరణ్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హుందాన్, తదితరులు హాజరవుతారని అన్నారు. మధ్యాహ్నం 12గంటలకు భూమిపూజ కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందని ఆయన తెలిపారు.





అక్బర్‌నగర్ గ్రామ శివారులో చిరుత సంచారం


దాడిలో మృతి చెందిన మేక

● చిరుత దాడిలో మేక మృతి

రుద్రూరు, మార్చి 3 : రుద్రూరు మండలంలోని అక్బర్‌నగర్ గ్రామ శివారులో చిరుత సంచరిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. శనివారం రాత్రి అక్బర్‌నగర్ గ్రామంలో షేక్ బిలాల్ అనే వ్యక్తికి చెందిన మేకను రాత్రి సమయంలో గదిలో నుంచి తీసుకువచ్చి పులిదాడి చేసి చంపేసిందని అనుమానిస్తున్నారు. ఈ మధ్య తరచూ చిరుతపులి సంచారంతోగ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ప్రధాన రహదారి పక్కనే గదిలో ఉన్న మేకపై దాడి చేసి చంపడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. గత కొన్ని రోజులుగా గ్రామం మధ్యలోకి చిరుత వచ్చిందని, అదే విధంగా గ్రామ శివారులో ఉన్న గడీలో కూడా చిరుత సంచరిస్తున్నట్లు చెబుతున్నారు. చిరుత సంచారంపై అటవీశాఖ అధికారులు స్పందించి చిరుతకు సంబంధించి విచారణ చేపట్టి జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విండో చైర్మన్‌కు సన్మానం


విండో చైర్మన్‌ను సన్మానిస్తున్న టీపీసీసీ కార్యదర్శి

డిచ్‌పల్లి,,మార్చి 3: మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లి విండో చైర్మన్‌గా ఎన్నికైన రాంచందర్‌గౌడ్‌ను టీపీసీసీ ప్రధానకార్యదర్శి నగేష్‌రెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా నగేష్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధి కోసం కృషి చేస్తోందని రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రుణాలు అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు అమృతాపూర్ గంగాధర్, శ్రీనివాస్, గంగారెడ్డి, తదితరులు ఉన్నారు.

రాజరాజేశ్వర ఆలయంలో తాగునీటి వసతికి నాలుగు ట్యాంకుల అందజేత

నవీపేట,మార్చి3: మండలంలోని నాళేశ్వర్‌లోని రాజరాజేశ్వర ఆలయంలో తాగునీటి సౌకర్యార్థం గ్రామానికి చెందిన కోనేరు పెద్ద భీంరెడ్డి నాలుగు తాగునీటి ట్యాంకులను విరాళంగా అందజేశారు. రాబోయే మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఈ తాగునీటి ట్యాంకులు ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బినోల సొసైటీ చైర్మన్ హన్మాండ్లు, తాజామాజీ సర్పంచ్ సరిన్, సుధాకర్, ప్రసాద్, లక్ష్మణ్, సురేష్, నవీన్, సతీష్ తదితరులున్నారు.

పోలియో రహిత సమాజం కోసం ప్రతీఒక్కరు కృషి చేయాలి

● ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి


ఆర్మూర్‌లో పిల్లలకు పోలియోచుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, మార్చి3: పోలియో రహిత సమాజం కోసం ప్రతీఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆర్మూర్ పట్టణంలోని గోల్‌బంగ్లా వద్ద పల్స్ పోలియో కేంద్రంలో ఆయన పిల్లలకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల లోపు పిల్లలకు తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని అన్నారు. పట్టణంలోని బస్టాండ్, గ్రామపంచాయతీ కార్యాలయాలు, వివిధ కూడళ్లలో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో రమేష్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ అశోక్, కలిగోట గంగాధర్, వైద్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

● కన్యక పరమేశ్వరి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

అనంతరం ఆర్మూర్‌లోని శ్రీ వాసవిమాత కన్యక పరమేశ్వరి ఆలయ 17వ వార్షికోత్సవం సందర్భంగా కుంకుమాపూజ, చండీయాగం కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా హిందువులందరు ఏకతాటిపైకి రావాలన్నారు. హిందు ఆలయాలపై దాడిని తిప్పికొట్టాలని, ప్రతీఒక్కరు ధర్మం కోసం కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

● నిధులు కేటాయించాలి సీఎస్‌కు వినతి

కొడంగల్‌తో సమానంగా ఆర్మూర్ నియోజకవర్గానికి నిధులు కేటాయించాలని కోరుతూ ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి శాంతికుమారికి శనివారం ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి వినతపత్రం అందజేశారు. ఆర్మూర్ నియోజకవర్గంలో మౌలిక వసతుల కోసం ఆసుపత్రిలో పరికరాల కోసం సమాన నిధులు కేటాయించాలని ఆయన కోరారు. ముఖ్యమంత్రి నియోజకవర్గానికి రూ.1424కోట్ల నిధులు కేటాయించాలని, అదే విధంగా ఆర్మూర్ నియోజకవర్గానికి కేటాయించాలని ఎమ్మెల్యే విన్నవించారు.

'నిరుద్యోగులను దగా చేసిన కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి'


కోటగిరిలో మాట్లాడుతున్న సీపీఐ నియోజకవర్గ నాయకులు దుబాస్ రాములు

కోటగిరి,మార్చి3: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిరుద్యోగులకు ఏడాదికి 2కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి దగా చేసిందని, ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందని సీపీఐ నియోజకవర్గ నాయకులు దుబాస్ రాములు పేర్కొన్నారు. కోటగిరి మండల కేంద్రంలో ఆదివారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులతో పాటు రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వం అమానుషంగా వ్యవహరిస్తుందన్నారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరను కల్పించడం లేదన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో రైతులు ఉద్యమాలు చేస్తే ఉక్కుపాదం మోపడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. రైతులకు వ్యతిరేకంగా నల్ల చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ ఆస్తులను ప్రైవేటు పరం చేయడంలో బీజేపీ దిట్ట అని విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బీజేపీ అటావో.. దేశ్‌కో బచావో నినాదంతో అన్ని వర్గాల ప్రజలు ఉద్యమాలకు సిద్ధం కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి విఠల్ గౌడ్, నాయకులు గంగాధర్, రాములు, హన్మాండ్లు, నగేష్, వీరేశం, మునీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో భార్యను చంపిన భర్త

● నిందితుడి అరెస్టు రిమాండ్


మాట్లాడుతున్న సీఐ మల్లేష్, ఎస్సై

జక్రాన్‌పల్లి, మార్చి3: భర్త మద్యం సేవించి భార్య కేలోత్ సరిత (35)ను కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందినట్టు డిచ్‌పల్లి సీఐ మల్లేష్, జక్రాన్‌పల్లి సీహెచ్. తిరుపతి తెలిపారు. మద్యం మత్తులో భార్యను చంపిన ఘటన మండలంలోని గన్యతండా గ్రామపరిధిలో నూర్‌సింగ్‌తండాలో చోటు చేసుకుంది. ఆదివారం డిచ్‌పల్లి సీఐ మల్లేష్, జక్రాన్‌పల్లి ఎస్సై సీహెచ్.తిరుపతిలు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గన్యతండా గ్రామపరిధిలో గల నూర్‌సింగ్‌తండాకు చెందిన కెలోత్ సరితకు అదే గ్రామానికి చెందిన కేలోత్ శ్రీనివాస్ (సుధాకర్)తో గత 20ఏళ్ల క్రితం వివాహం జరిగింది. ఆమె భర్త శ్రీనివాస్ మద్యం బానిసై తరచు భార్యతో గొడవపడుతూ చిత్రహింసాలకు, కొడుతూ ఉండేవాడన్నారు. ఈనెల 1న మధ్యాహ్నం ఇంటికి వచ్చి శ్రీనివాస్ భార్యతో గొడవ పెట్టుకొని ఆ గొడవలో ఎలాగైన చంపాలని అనుకొని పథకం ప్రకారం అదే రోజు సాయంత్రం ఇంట్లో ఎవరు లేని సమయంలో భార్య సరితను చేతులతో ముఖంపై పిడుగుద్దులు గుద్ది ఇంట్లో ఉన్న గొడ్డలితో తలపై, ఇతర చోట్ల విపరీతంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్టు తెలిపారు. ఈ ఘటన విషయంలో తొలుత అనుమానాస్పద మృతి చెందినట్టు కేసు నమోదు చేసి విచారణ జరపగా వాస్తవ ఘటన మరో విచారణ అనంతరం భర్త శ్రీనివాసే భార్యతో గొడవపడి చంపినట్టు విచారణలో తేలిందని, నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్టు సీఐ, ఎస్సై తెలిపారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం


పోచంపాడ్‌లో 2002-03 పూర్వ విద్యార్థులు


ముప్కాల్ ఆత్మీయ సమ్మేళనంలో 1997-98బ్యాచ్ పూర్వవిద్యార్థులు

మెండోర, మార్చి3: ఆశ్చర్యం.. ఆనందం.. అప్యాయతలకు వేదికైంది. మెండోర మండలం పోచంపాడ్‌లో వారు చదువుకున్న పాఠశాల జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో 2002-03బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు అపూర్వ సమ్మేళనం జరిగింది. 20ఏళ్ల తర్వాత జీవిత అనుబంధాల్లో మునిగిన వారు ఆదివారం వేదికపై తమ అనుభవాలను బాధ్యతలను పంచుకున్నారు. ఆడిపాడి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం తరచు కలుసుకోవాలని పాఠశాలకు సామాజికంగా స్వచ్ఛందంగా సేవలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు మనోహర్‌కుమార్, వినోద్, బసంత్, నీలకంఠం, రామచంద్ర, సురేందర్‌గౌడ్, మంజుల,గంగామణి,పూర్వవిద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

● ముప్కాల్‌లో ఆత్మీయ సమ్మేళనం

ముప్కాల్: బాల్కొండ మండలం కిసాన్‌నగర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వవిద్యార్థుల ఆత్మీసమ్మేళనం ఘనంగా జరుపుకున్నారు. 1997-98 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు 25ఏళ్ల తర్వాత అందరు ఒకే చోట కలువడం ఆనందంగా ఉందన్నారు. తరగతి గదుల్లో తిరుగుతూ అనాటి రోజులు గుర్తు చేసుకుంటూ అనాటి జ్ఞాపకాలను నేమరువేసుకున్నారు. చాలా రోజుల తర్వాత కలిసిన సందర్భంగా ఒకరినోకరి యోగా క్షేమాలు అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్య బోదించిన ఉపాధ్యాయులను శాలువ, పూలమాలలతో వారు ఘనంగా సన్మానించారు.

● సిల్వర్ జూబ్లీ జరుపుకున్న విద్యార్థులు


ఉప్లూర్ 1999-2000 పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

కమ్మర్‌పల్లి: మండలంలోని ఉప్లూర్ గ్రామానికి చెందిన 1999-2000 విద్యాసంవత్సర పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు 25 ఏళ్ల తరువాత ఒక చోట కలుసుకుని సిల్వర్‌జూబ్లీ ఉత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాలలో వివిధ వృత్తులు, వ్యాపారాలు, ఉద్యోగులు స్థిరపడినపూర్వ విద్యార్థులు ఆదివారం ఒక చోట చేరి అప్యాయంగా పలకరించుకుంటు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువలతో సన్మానించుకుని వారి ఆశీర్వాదాలు అందుకున్నారు. అంతకు ముందు తాము చదివిన పాఠశాలకువెళ్లి గతస్మృతులను గుర్తు చేసుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేసి రోజంతా ఆనందడోలికల్లో మునిగి తేలారు. సమ్మేళనంలో ఉపాధ్యాయులు రాజేశ్వర్‌గౌడ్, లింబాగౌడ్, కూనగంగాధర్, భార్గవ్, గంగారాం, సుదర్శన్ , పూర్వ విద్యార్థులు సంతోష్ గౌడ్, చంద్రకాంత్ మంద శ్రీనివాస్, ఏనెడ్ల రవిందర్, సంతోష్ గంగారెడ్డి, ఇబ్రహిం, రమేష్, క్రాంతి, శ్రీనివాస్ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

ఖమ్మం బయలుదేరిన సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్(ప్రజాపంథ) నాయకులు

కమ్మర్‌పల్లి, మార్చి 3: ఈ నెల 3 నుంచి 5 వతేదీవరకు మూడు రోజుల పాటు జరుగనున్న యూనిటీ మహాసభలకు ఆర్మూర్ డివిజన్ వ్యాప్తంగా సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్(ప్రజాపంథ) నాయకులు ఆదివారం తెల్లవారుజామున భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. వివిధ ప్రాంతాల నుంచి జిల్లా సరిహద్దులోని కమ్మర్‌పల్లికి చేరుకున్నవాకి స్వాగతం పలికి బస్సులు బయలుదేరేముందు సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథ) రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు వి. ప్రభాకర్ ఎర్రజెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి వెళ్లిన నాయకులు దేవారాం, కిషన్, మెత్తెన్న, సత్యనారాయణ,రాజేశ్వర్,సత్తెక్క,రమ,దామోదర్, రాజన్న,బాజన్న,రమేష్, లింబాద్రి, అశోక్‌నసీర్, కిషన్ తదితరులు ఉన్నారు.

విలీన సభలకు బయలుదేరిన నాయకులు

ఆర్మూర్‌టౌన్: ఖమ్మంలో జరుగుతున్న మూడు పార్టీల విలీన సభలకు శనివారం రాత్రి నాయకులు బయలుదేరారు. సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథ, సీపీఐఎంల్ పీసీసీ, సీపీఐఎంఎల్ ఆర్ఐ పార్టీల విలీన సభలను విజయవంతం చేయడానికి సీపీఐ(ఎంఎల్) నాయకులు టి.కిషన్, మచ్చర్ల రాజన్న, ఠాగూర్, ఆకుల గంగన్న, అమీనాపూర్ రమేష్, తలారి గంగాధర్, పుప్పాలపల్లి గంగాధర్, కర్రె రాజారాం, లక్ష్మక్క, సునీత, లనిల్‌కుమార్, తదితరులు బయలుదేరారు.

అనాథ పిల్లలకు పండ్ల పంపిణీ


పిల్లలకు పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

డిచ్‌పల్లి,,మార్చి 3 :మండలంలోని తహసీల్దార్ కార్యాలయం వెనుక గల మానవతసదన్‌లో జిల్లా యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు నరేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని చిన్నారులకు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్, యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేష్ చిన్నారులకు పండ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవతసదన్ చిన్నారులు చక్కగా చదివి ఉన్నత శిఖారాలు అధిరోహించాలన్నారు. చదువు ద్వారానే ఏదైనా సాధ్యమని అనాధ చిన్నారులకు ప్రభుత్వం అండగా ఉంటోందన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కప్పలవాగులో ప్యాకేజ్ 21 ఔట్ లెట్ ద్వారా నీళ్లు వదలాలి


ఇరిగేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

భీమ్‌గల్‌రూరల్, మార్చి3: కప్పలవాగు పరివాహక గ్రామాల రైతుల కోరిక మేరకు గడిచిన 20 రోజుల క్రితమే ఇరిగేషన్ సీఈతో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి వేల్పూర్‌లో ఆదివారం ఫోన్‌లో మాట్లాడంతో పాటు ఎమ్మెల్యే లెటర్ ద్వారా కూడా నీళ్ల వదలాలి అని విన్నవించడం జరిగిందని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బాబ్లీ నుం చి కూడా శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టుకు నీళ్లు వదిలారు కావున మొదటి విడుతగా రోజుకు 300ల క్యూసెక్కుల చొప్పున 10 రోజులు 0.5 టీఎంసీ నీరు వదలాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు.రెండు రోజుల్లో కప్పవాగు పెద్ద వాగులో ప్యాకేజ్ 21 ఔట్ లెట్ ద్వారా నీళ్లు వదలకుంటే వాగు పరివాహక గ్రామ రైతులతో కలిసి ప్రత్యక్ష పోరాటానికి దిగుతామని ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి హెచ్చరించారు.

ఉర్దూ అకాడమీ చైర్మన్‌కు సన్మానం


తాహెర్‌బిన్‌హందాన్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కోటగిరి,మార్చి3: ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా ఎన్నికైన తాహెర్ బిన్ హందాన్‌ను ఆదివారం మండల కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన నివాసంలో తాహెర్ బిన్ హందాన్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నజీర్, కిషన్, వలీయొద్దీన్, భీమా సాయిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● తాహెర్‌బిన్‌హందాన్‌కు సన్మానం

నిజామాబాద్ అర్బన్:రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా నియమితులైన తాహెర్‌బిన్‌హందాన్‌ను ఆదివారం నగరానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు కలిసి సన్మానించారు. నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కేశవేణు, మాజీమార్కెట్ కమిటీ చైర్మన్ నగేష్‌రెడ్డి, కొండ పాకరాజేశ్ తదితరులు తాహెర్‌ను సన్మానించారు. పార్టీ లో 40 ఏళ్లుగా నిరంతర సేవకుడికిగా పనిచేస్తున్న తాహెర్‌కు ప్రభు త్వం రాష్ట్ర స్థాయి పదవిని ఇవ్వడం గొప్ప విషయమని నేతలు అన్నారు.

క్రికెట్‌లో గెలుపొందిన వారికి నగదు బహుమతి


నాళేశ్వర్‌లో గెలుపొందిన జట్టు సభ్యులు

నవీపేట,మార్చి3: మండలంలోని నాళేశ్వర్‌లో జరిగిన క్రికెట్ పోటీలలో గెలుపొందిన వారికి ఆదివారం నగదు బహుమతిని అందజేశారు. ప్రతీ సంవత్సరం మహాశివరాత్రి సందర్భంగా వారం రోజుల పాటు క్రికెట్ పోటీలు నిర్వహించడం ఆనవాయితీ ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో విన్నర్ జట్టుకు రూ.7,777, రన్నర్ జట్టుకు రూ.6,666 నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో బినోల సొసైటీ చైర్మన్ హన్మాండ్లు, తాజామాజీ సర్పంచ్ సరిన్, లక్ష్మణ్, సురేష్, ప్రవీణ్, మోహన్ తదితరులున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కోటగిరి,మార్చి3: పొతంగల్ మండల కేంద్రంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం పట్టుకున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారన్న సమామాచారం మేరకు వాహనాన్ని పట్టుకుని స్టేషన్‌కు తరలించాలన్నారు. అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆర్మూర్‌లో ఉచిత మెగావైద్యశిబిరం

పెర్కిట్, మార్చి3: ఆర్మూర్ పట్టణంలో మేరు సంఘ భవనంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. లైఫ్ ఆసుపత్రి డాక్టర్ రామగిరి భాను ఆధ్వ ర్యంలో ప్రజలకు బీపీ, షుగర్, నరాల, డెంటల్ పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కొట్టూరు వంశీకృష్ణ, డాక్టర్ శ్రీకాంత్‌లోయ, డాక్టర్ స్రవంతి రెడ్డి, డాక్టర్ నాగభూషణం, డాక్టర్ జ్యోతిలు ప్రజలకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు వారికి మేరు సంఘం తరఫున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేరు సంఘం అధ్యక్షుడు రవినాథ్, కార్యదర్శి లక్ష్మణ్, కోశాధికారి విజయ్, గంగాధర్, మేరు సంఘ సభ్యులు, పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలుగా గాజుల శ్యామల


ఉత్తమ ఉపాధ్యాయురాలిగా గాజుల శ్యామలను సన్మానిస్తున్న దృశ్యం

ఏర్గట్ల,మార్చి 3:మండలంలోని తాళ్లరాంపూర్ ఒడ్డెర కాలనీలో ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీ ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తున్న గాజుల శ్యామలను జిల్లా కేంద్రంలో ఆదివారం రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఉత్తమ విద్యను అందిస్తున్నందుకు గాను ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఆమెను రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ అవార్డును అందజేశారు.ఈకార్యక్రమంలో పలువురు ఉపాధ్యా యులు పాల్గొన్నారు.



శాఖాపూర్ శివారులో ఉన్న మామిడి తోట

తొమ్మిదిన్నర ఎకరాల మామిడి తోట..

ఇస్కాన్ సంస్థకు అందజేత

● జిల్లాకు చెందిన శ్రీనివాస్ రావు భూ విరాళం



మామిడి తోటలో పూజలు చేస్తున్న శ్రీనివాస్ రావు

నవీపేట, మార్చి 3: జిల్లాలోని నవీపేట మండలం హనుమాన్ ఫారంకు చెందిన కొండపావులూరి శ్రీనివాస్ రావు, సుభాషిణి దంపతులు సుమారు 3కోట్ల రూపాయల విలువైన తమ తొమ్మిదిన్నర ఎకరాల మామిడి తోటను ఇస్కాన్ సంస్థకు ఆదివారం విరాళంగా అందజేశారు. హైదరాబాద్‌లో వ్యాపారం చేస్తున్న శ్రీనివాస్ రావు హరేకృష్ణ మూమెంట్ ఇస్కాన్ సంస్థలో సభ్యుడిగా ఉన్నారు. వారు ఎన్నో ఏళ్లుగా శ్రీకృష్ణుడి భక్తులుగా కొనసాగుతున్నారు. ఆదివారం మండలంలోని శాఖాపూర్ గ్రామ శివారులో తమకు న్న సుమారు 3కోట్ల రూపాయల విలువైన తొమ్మిదిన్నర ఎకరాల మామిడి తోటను ఇస్కాన్ సంస్థకు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా మామిడి తోటలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీనివాస్ రావు మాట్లాడుతూ.. త్వరలోనే ఈ స్థలంలో ఇస్కాన్ మందిరం, వృద్ధాశ్రమంతో పాటు గోశాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రజలలో భక్తిభావం మరింతగా పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం తమ స్వగ్రామమైన హనుమాన్ ఫారంలో కూడా లక్ష రూపాయల విలువతో ఏర్పాటు చేసిన తాగునీటి శుద్ధి కేంద్రాన్ని విరాళంగా అందజేసి ప్రారంభించారు. తన తండ్రి వెంకటేశ్వర్ రావు జ్ఞాపకార్థం ఈ విరాళాలను అందజేస్తున్నట్లు శ్రీనివాస్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో హరేకృష్ణ మూమెంట్ ఇస్కాన్ సంస్థ ప్రతినిధులు సింహచల దాతు, మురారి ప్రభుతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం



మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నిజామాబాద్ అర్బన్, మార్చి 3: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పీఆర్టీయూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నగరంలోని రాజీవ్‌గాంధీఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమానికి రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రతి నెల మొదటి తారీఖునే జీతాలు జమ చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఉద్యోగ,ఉపాధ్యాయులతో స్నేహపూర్వకంగా ఉంటోందని వారికి రావలసిన పీఆర్సీ బకాయిలు, పెండింగ్ బిల్లులు మార్చి చివరి నాటికి జమ అయ్యేలా సీఎం.హామీ ఇచ్చారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందన్నారు. పీఆర్టీయూ ఉపాధ్యాయుల పక్షపాతి అని, రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఆ ప్రభుత్వానికి పూర్తి సహకారం అందిస్తామని పీఆర్‌టియు జిల్లా అధ్యక్షుడు మో హన్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి వెంకటేశ్వర్‌గౌడ్, ఇల్తేపుశంకర్, పెంటజలందర్, రచ్చమురళి, రాధ, ఆశారాణి, వరలక్ష్మి, కాంగ్రెస్ నాయకులు సాయరెడ్డి, శేఖర్‌గౌడ్, పీఆర్‌టియు నాయకులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో మెగా వైద్యశిబిరం

పెర్కిట్, మార్చి 3: ఆర్మూర్ పట్టణంలో మేరు సంఘ భవనంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. లైఫ్ ఆసుపత్రి డాక్టర్ రామగిరి భాను ఆధ్వ ర్యంలో ప్రజలకు బీపీ, షుగర్, నరాల, డెంటల్ పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కొట్టూరు వంశీకృష్ణ, డాక్టర్ శ్రీకాంత్‌లోయ, డాక్టర్ స్రవంతిరెడ్డి, డాక్టర్ నాగభూషణం, డాక్టర్ జ్యోతిలు ప్రజలకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు వారికి మేరు సంఘం తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేరు సంఘం అధ్యక్షుడు రవినాథ్, కార్యదర్శి లక్ష్మణ్, కోశాధికారి విజయ్, గంగాధర్, మేరు సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కమ్మర్‌పల్లి, మార్చి 3: కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో నిర్మాణమవుతున్న అయ్యప్ప ఆలయానికి కమ్మర్‌పల్లికి చెందిన ఏలేటి బాల్ రెడ్డి స్రవంతి దంపతులు లక్షా 111 రూపాయలను విరాళంగా అందజేశారు. ఆదివారం ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు రాజశేఖర్ (బద్రి)కి తమ కూతురు భవ్యంతి చేతుల మీదుగా విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆక్స్‌ఫడ్ శ్రీనివాస్, మహేందర్, చంద్రశేఖర్ దాత కుటుంబ సభ్యులు ఉన్నారు.



నగరంలో పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే ధనపాల్



బోధన్ ఆసుపత్రిలో చుక్కల మందు వేస్తున్న జడ్పీ చైర్మన్



మెండోరలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న జడ్పీటీసీ గంగాధర్

జిల్లా వ్యాప్తంగా పల్స్‌పోలియో ప్రారంభం

పెద్దబజార్, మార్చి 3: జిల్లా వ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం ప్రారంభమైంది. పోలియో నిర్మూలనకు తల్లిదండ్రులు సహకరించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్‌సూర్యనారయణ అన్నారు. పల్స్ పోలియో సందర్భంగా ఆదివారం నగరంలోని దుబ్బా 16వ డివిజన్‌లో యూపీహెచ్‌సీ దవఖానాలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిన్నపిల్లలకు పోలియో చుక్కల మందును వేశారు. అనంతరం మాట్లాడుతూ.. గతంలో ప్రపంచవ్యాప్తంగా పోలియో అంటే పెద్ద వ్యాధిగా భావించి ప్రజలందరు భయపడే వారన్నారు. ఈనెల 3, 4, 5 తేదీల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో పల్స్ పోలీయో కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని అన్నారు. 5ఏళ్ల లోపు పిల్లలందరికి పోలియో చుక్కలు వేయించి పోలియో నిర్మూలన ఉద్యమంలో ప్రతి ఒక్కరూ పాల్గొన్నాలన్నారు. పోలియో రహిత భారత్ నిర్మాణానికి ప్రజలందరు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సుదర్శనం, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అంజన, రాజు, మెడికల్ ఆఫీసర్, డాక్టర్ వెంకటేశ్, హెల్త్‌అసిస్టెంటెంట్ శ్రీధర్, కార్పోరేటర్లు పంచరెడ్డి ప్రవళిక శ్రీధర్, మమత ప్రభాకర్, బీజేపీ నాయకులు రోషన్‌లాల్‌బోరా, రంజీత్, దీపక్, రాజు తదితరులు పాల్గొన్నారు.

బోధన్ రూరల్: రెండు చుక్కలు ఐదు సంవత్సరాల లోపు చిన్నారుల జీవితానికి తొలి మెట్టు అని జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా బోధన్ ఆసుపత్రిలో ఐదు సంవత్సరాల లోపు చిన్నారులకు చుక్కల మందులను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాల లోపు ఉన్న చిన్నారులకు తల్లిదండ్రులు తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని ఆయన కోరారు. ఇండ్లలో ఒక లక్షా 91 వేల 87 మంది చిన్నారులు సుమారుగా ఉన్నారని, బోధన్ డివిజన్‌లో సుమారు 37 వేలకుపైగా చిన్నారులు ఉన్నారన్నారు. ఆసుపత్రులు, కొత్త బస్టాండ్ తదితర ప్రాంతాలలో చుక్కల మందు కార్యక్రమం నడుస్తుందన్నారు. ఐదు సంవత్సరాల లోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలను వేయించాలన్నారు. పిల్లలను పోలియో మహమ్మారీ నుంచి కాపాడుకోడానికి భవిష్యత్తులో వారు ఆరోగ్యంగా ఉండటానికి తల్లిదండ్రులు తప్పనిసరిగా తమ పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేయించాలన్నారు. ఈకార్యక్రమంలో బోధన్ ఆర్డీవో రాజాగౌడ్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ విద్య, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాహుల్, కౌన్సిలర్లు శరత్‌రెడ్డి, దాము, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పాషా మొహీనుద్దీన్, ఆసుపత్రి వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి : కోటగిరి ఉమ్మడి మండలంలో పల్స్ పోలియో కార్యక్రమం ఆదివారం విజయవంతమైంది. 5సంవత్సరాల లోపు 7,197మంది చిన్నారులు ఉండగా 55పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశారు. 7,197మంది చిన్నారులు ఉండగా 6581మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు అధికారులు తెలిపారు. కోటగిరి ఉమ్మడి మండలంలో 91శాతం నమోదైనట్లు తెలిపారు. ఆయా గ్రామాలలో ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది చిన్నారులకు పోలియో చుక్కలను వేశారు. మిగిలిన వారికి సోమవారం, మంగళవారం ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేస్తామని ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కొట్టం మనోహర్, కాంగ్రెస్ నాయకులు షహీద్, గంగాధర్ రావు దేశాయ్, నాయకులు రాంబాబు, ఫారూఖ్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

వర్ని: మండలంలో పల్స్ పోలియో చుక్కల మందు పంపిణీ కార్యక్రమం విజయవంతమైంది. 5సంత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మేక లక్ష్మి వీర్రాజు, సోసైటీ చైర్మన్ దశరథ్, టౌన్ ప్రెసిడెంట్ మొయిన్, ప్రధాన కార్యదర్శి హర్ష, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెండోర: పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతీఒక్కరు సహకరించాలని జడ్పీటీసీ తలారి గంగాధర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పల్స్‌పోలియో కేంద్రాన్ని జడ్పీటీసీ గంగాధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మెండోర, వెల్కటూర్, సావెల్, పోచంపాడ్, దూదిగాం, బుస్సాపూర్, కోడిచర్ల, చాకిర్యాల్, సోన్‌పేట్, నడిమితాండా, నెహ్రూనగర్ గ్రామాల్లో పల్స్‌పోలియో కేంద్రాలలో పోలియో చుక్కలను చిన్నారులకు వేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్‌లు ప్రణవ, ఎఎన్ఎంలు, ఆశవర్కర్‌లు, అంగన్‌వాడి టీచర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

డొంకేశ్వర్: మండలంలోని అన్నారం, సిర్పూర్, డొంకేశ్వర్ గ్రామాలలో ఆదివారం పల్స్‌పోలియో కేంద్రాలను మండల వైద్యాధికారి విద్యాసాగర్ పరిశీలించారు. పోలియో కేంద్రాలలో పిల్లలకు ఆయన పోలియో చుక్కలు వేశారు. ఐదేళ్ళ లోపు పిల్లలకు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. మండలంలో 97శాతం పల్స్‌పోలియో జరిగినట్టు ఆయన తెలిపారు.

జక్రాన్‌పల్లి: మండలంలో ఆదివారం నిర్వహించిన పల్స్‌పోలియో కార్య క్రమం విజయవంతమైంది. సికింద్రాపూర్, బాలనగర్ గ్రామంలో చిన్నారు లకు ఎంపీపీ కుంచాల విమల పల్స్‌పోలియో చుక్కలు వేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామ ప్రత్యేక అధికారులు, ఎంపీటీసీలు, అధికారులు కలిసి చిన్నారులకు పల్స్‌పోలియో చుక్కలు వేశారు.

ఏర్గట్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం ఐదేళ్ళలోపు చిన్నారులు పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. మండలంలోని తాళ్లరాంపూర్ గ్రామంలో ఎంపిటిసీ ఆడెపు సవిత పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశ వర్కర్‌లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: డివిజన్ పరిధిలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 295 బూత్‌లెవల్, ఏడు ట్రాన్సిట్ పాయింట్‌లు, 37మొబైల్ టీంలతో ఆది వారం పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతమైందని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రమేష్ తెలిపారు. డివిజన్ పరిధిలోని 69608 ఐదేళ్ళలోపు పిల్లలు ఉండగా 66వేల157మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరిగిందని, మిగతా పిల్లలకు సోమ, మంగళవారాల్లో ఇంటింటికి వెళ్ళి పోలియో చుక్కలు వేస్తారని ఆయన తెలిపారు.

కమ్మర్‌పల్లి: పోలియో సోకకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ప్రభుత్వం అందజేస్తున్న పోలియో చుక్కలను ఐదేళ్లలోపు ప్రతి పిల్లాడికి తప్పనిసరి వేయించాలని కమ్మర్‌పల్లి వైస్ ఎంపీపీ కాలేరి శేఖర్ అన్నారు. ఆదివారం మండంలోని కోనాసముందర్‌లో పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కమ్మర్‌పల్లిలో 6801 మంది పిల్లలకు చుక్కల మందు వేసినట్లు ఆసుపత్రి వైద్యులు ఎస్ఎల్ఎన్ స్వామి, చౌట్‌పల్లి ఆసుపత్రి పరిధిలో 5634 మంది పిల్లలకు చుక్కల మందు వేసినట్లు వైద్యురాలు సుప్రియ తెలిపారు.

నవీపేట: మండలంలో 5సంవత్సరాల మధ్య గల చిన్నారులకు 95శాతం పల్స్ పోలియో చుక్కల మందు పంపిణీ చేయడం జరిగిందని నవీపేట ప్రభుత్వ ఆసుపత్రి సూపర్‌వైజన్ కిషన్ తెలిపారు. మండలంలో 5,153మంది చిన్నారులకు గాను 4,873మంది చిన్నారులకు చుక్కల మందు వేయడం జరిగిందని మిగిలిన వారికి సోమ, మంగళ వారాల్లో ఇంటింటికి తిరిగి చుక్కల మందు వేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

మాక్లూర్: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాలలో ఆదివారం జరిగిన పల్స్‌పోలియో విజయవంతమైనట్టు వైద్యాధికారి వెంకటేష్ తెలిపారు. మండలంలోని మాదాపూర్ గ్రామంలో ఎంపీడీవో క్రాంతి పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమానికి డబ్ల్యుహెచ్‌వో డాక్టర్ ప్రదీప్, అప్జర్వర్ శ్రీకాంత్, పీహెచ్‌వో ఆనంద్, వైద్యసిబ్బంది, ఆశవర్కర్‌లు, ఆరోగ్యకార్యక్తలు, తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: మండలంతో పాటు 7వ పోలీసు బెటాలియన్‌లో ఆదివారం ఐదేళ్ల లోపు ఉన్న చిన్నారులకు పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతం అయింది. 7వ పోలీసు బెటాలియన్‌లో కమాండెంట్ రాంప్రకాష్ చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. డిచ్‌పల్లి ప్రభుత్వ 30బెడ్‌ల ఆస్పత్రిలో డాక్టర్ రాజేశ్వరీ పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు.

రుద్రూరు: మండల కేంద్రంతో పాటు అక్బర్‌నగర్ తది తర గ్రామాల్లో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. రుద్రూరు గ్రామ పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఇందూరు చంద్రశేఖర్, వైద్యాధికారి అయేషాలు చిన్నారులకు పోలియో చుక్కలను వేశారు. అదే విధంగా అక్బర్‌నగర్ పల్లె దవాఖానలో గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి డాక్టర్ సంతోష్, మాజీ సర్పంచ్ గంగామణిలు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమాలలో పీహెచ్‌సీ సూపర్ వైజర్, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీలు ఆశాకార్యకర్తలు, పాల్గొన్నారు.

రెంజల్: నూరేళ్ల నిండు జీవితానికి రెండు చుక్కలు ఎంతో ఉపయోగకరమని ఎంపీపీ రజిని కిషోర్, జడ్పీటీసీ విజయ సంతోష్ అన్నారు. ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా రెంజల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పిల్లలకు చుక్కల మందు వేసి పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. రెంజల్ మండలంలో 95శాతం పూర్తయిందని వైద్యాధికారి వినయ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తీరణ అధికారులు శ్రావణ్ కుమార్, రవీందర్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మేక సంతోష్, మాజతఈ ఎంపీటీసీ కిషోర్, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మోస్రా: ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని మోస్రా ఎంపీపీ పిట్ల ఉమా శ్రీరాములు, జడ్పీటీసీ భాస్కర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం పల్స్ పోలియో కేంద్రాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు పల్స్ పోలియో చుక్కల మందు వేయించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. మండలంలోని చింతకుంట, తిమ్మాపూర్, గోవూర్, చే నెంబర్ తండాలలో పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేసి పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయ్, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ, ఆశాలు, స్వచ్ఛంద సంస్థల యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ముప్కాల్: ప్రతీ చిన్నారికి రెండు పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజాన్ని నిర్మేందుకు ప్రతీఒక్కరు కృషి చేయాలని ముప్కాల్ ఎంపీపీ సామ పద్మ అన్నారు. ఆదివారం బాల్కొండ, ముప్కాల్ ఉమ్మడి మండలాల్లోని ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాల్లో వైద్యసిబ్బందితో కలిసి పల్స్‌పోలియో కేంద్రాన్ని ఆమె ప్రారంభించి పిల్లలకు పల్స్ పోలియో చుక్కలను వేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సిబ్బంది, ఆశవర్కర్‌లు, తదితరులు పాల్గొన్నారు.



మాక్లూర్‌లో..



డొంకేశ్వర్‌లో..



ముప్కాల్‌లో..



పెర్కిట్‌లో..



కమ్మర్‌పల్లిలో..



ఏర్గట్లలో

లారీని వెనుక నుంచి ఢీకొన్న ఆటో

● ముగ్గురికి గాయాలు

నవీపేట, మార్చి 3: మండల కేంద్రంలోని చెక్‌పోస్ట్ సమీపంలో ఆదివారం రాత్రి నిలబడి ఉన్న లారీని వెనుక నుంచి వచ్చిన ఆటో ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. నవీపేట నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న ఆటో చెక్‌పోస్టు సమీపంలో నిల బడి ఉన్న లారీని వెనుక నుండి ఢీకొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న వ్యక్తితో పాటు ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కాగా అందులో ప్రయాణిస్తున్న మహిళకు స్వల్ప గాయాలయ్యాయని స్థానికులు పేర్కొన్నారు. బాధితులను 108లో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

భీమ్‌గల్ రూరల్ మార్చి 3: సుదర్శన్‌నగర్ తండా గ్రామ శివారులో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో జగిర్యాల్ గ్రామానికి చెందిన కొనపర్తి లింబాద్రి(53) అనే వ్యక్తి గుర్తుతెలియని వాహ నం ఢీకొని మృతి చెందినట్టు ఎస్సై హరిబాబు ఆదివారం సాయంత్రం తెలియజేశారు. ఎస్ఐ తెలిపిన వివరాలు.. శనివారం రాత్రి పెర్కిట్ వెళ్లి తిరిగి వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టినట్టు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

'మోదీ సభను విజయవంతం చేయాలి'

ఎల్లారెడ్డి, మార్చి3: ఈనెల 5వ తేదీన సంగారెడ్డిలో జరిగే మోదీ సభను విజయవంతం చేయాలని అసెంబ్లీ కన్వీనర్ లింగారావు కోరా రు. పలు అభివృద్ధి కార్యకలాపాలకు శంకుస్థాపన చేయడానికి విచ్చే స్తున్న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సభను విజయవంతం చేయా లని కోరారు. అదే విధంగా జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా పార్ల మెంటరీ బోర్డు బీబీ పాటిల్‌ని అభ్యర్థిగా ప్రకటించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ పార్టీ సభ్యులు అందరూ అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబ డి ఉండి కలిసికట్టుగా పని చేసి అత్యధిక భారీ మెజారిటీతో గెలిపించాలని అన్నారు.

తాడ్వాయి: సంగారెడ్డిలో ఈనెల 5న జరిగే ప్రధాని నరేంద్రమోదీ సభను విజయవంతం చేయాలని ఎల్లారెడ్డి అసెంబ్లీ కన్వీనర్ లింగా రావు కోరారు. మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం కార్యకర్తలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లారెడ్డి అసెంబ్లీ నుంచి పెద్ద సంఖ్యలో మోదీ సభకు తరలిరావాలని, బీబీ పాటిల్‌ను బీజేపీ అభ్యర్థిగా ప్రకటించినందుకు హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.140	రూ.215	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	రూ.145	రూ.220	రూ. 250

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.64,250	రూ.59,250	రూ.750

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : ఆపరేషన్ వాలెంటైన్ (11.00, 1.55, 4.50, 7.45, 10.40),
స్క్రీన్-2 : దునే పార్ట్2 (ఇంగ్లీష్) (10.05) చారి 111 (1.35, 10.10) వ్యూహం (4.25) భూతద్దం భాస్కర్ నారాయణ (12.10)
స్క్రీన్-3 : భూతద్దం భాస్కర్ నారాయణ (12.10) దునే పార్ట్2 (ఇంగ్లీష్) (3.10, 6.40, 10.10),
స్క్రీన్-4 : ఇంటి నెంబరు 13 (1.05) కిక్ (3.50) ఆర్టికల్ 370 (హిందీ) (7.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : వ్యూహం (10.55) ఊరుపేరు భైరవకోన (1.30) సమరసింహారెడ్డి (1.30) ఆపరేషన్ వాలెంటైన్ (4.30)
స్క్రీన్-2 : చారి 111 (11.00) హనుమాన్ (1.30, 4.30), వ్యూహం (7.30) కిక్ (10.30)
స్క్రీన్-3 : మా ఊరి రాజారెడ్డి (10.30), ఆపరేషన్ వాలెంటైన్(1.30), భూతద్దం భాస్కర్ నారాయణ (4.20, 10.20), ఊరుపేరు భైరవకోన (7.20)

దేవి : ఆపరేషన్ వాలెంటైన్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహాల్ : సమర సింహారెడ్డి (11.00, 9.15), కిక్ (2.15, 6.15)
నటరాజ్ : ఇంటి నెంబరు - 13 (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : ఊరుపేరు భైరవకోన (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్